
# నిష్కృతి

టి.నారాయణమూర్తి



*తప్పుచేయడం ఒకఎత్తు. అది తప్పని తెలుసుకొనడం మరొక ఎత్తును. ఒకరి శిక్షకన్న అధికంగా బాధించేది పశ్చాత్తాపం. అయినా నిష్కృతి లభించక పోవడం నిజంగా దురదృష్టం.*

"ఏ తీరుగ నను దయ చూచెదవో
ఇనవంశోత్తమ రామా?
నా తరమా భవసాగర మీదను
నళినదళేక్షణ రామా!!...."

**తప్పుచేయని** మానవుడంటూ లేడేమో! ఐనా పొరపాటుగా చేసిన తప్పును పురస్కరించు కొని ఈ మానవలోకం నా పొరపాటును నా అల వాటుగానే భావించింది. అందుకు నాకు బాధ లేదు. కాని....కాని....

ఏవేవో గతజీవితపు స్మృతుల కౌగిలింతలతో రాత్రంతా గడిపాను. త్రాగుబోతులు, జూద రులు, రోగులు, విధి అనుకూలించనివారు — వీరికి నిద్రపట్టే సమయం ఉషస్సమయం. అప్పుడే నాకు కునుకు పట్టింది.

ఇంతలోనే యీ పాట....పాటగాదు ప్రార్థన, భక్తి, వినయం, బాధ, శోకం—ఇన్నీ మిళితమైన ఆలాపన ధ్వని!

పిలుపుకందే దూరంలో 'బంయ్' మంటూ వినిపించింది విజిలు. ఖైదీలను నిద్రలేచి కాల కృత్యాలు తీర్చుకోమని ఆజ్ఞాపించే అధికారపూరిత ధ్వని అందులో ప్రతిధ్వనించింది.

"రామచంద్రా! ఆపద్బాంధవా! పాహి, పాహి....."

పక్కమీదినుండి లేవకుండానే ప్రక్కగది వేపు చూశాను. ఒక వయసుముదిరిన ఖైదీ ఇనుపకమ్మీల సందులలోంచి కనిపించాడు. అర్ధ నిమీలిత నేత్రాలతో, పద్మాసనం వేసుకుని, కృతమనస్కుడై కూర్చుని ఉన్నాడు. నిండుగా పెరిగి పండుబారిన గడ్డం ఎంతో జీవితాను భవాన్ని చాటుతున్నది. గుబురు మీసాల క్రిందుగా లేత చిరునవ్వు లాస్యం చేస్తున్నది. గళ్ల బనీను,

మీ వ్యక్తిగత క్రమశిక్షణ
కార్యనిరతి కృతనిశ్చయం
దేశరక్షణకు అవసరం




అమృతాంజనం
లేదా?

జ్వరం తగిలినట్టుందే!"

ఏమో ఎప్పుడు అవసరమొస్తుందో ఎప్పుడూ అమృతాంజనం దగ్గర వుంచుకోవటం ఉత్తమం. అమృతాంజనం యింట్లో వుందంటే మీరు నిశ్చింతగా వుండవచ్చు.

అమృతాంజన్ లిమిటెడ్
14/15 లజ్ చర్చిరోడ్డు, మద్రాసు-4
బొంబాయి-1, కలకత్తా-1, న్యూఢిల్లీ-1.




IWT-AM 1879

# నిష్కృతి

గళ్ల నిక్కరు ఉండి అతను ఖైదీ అనే విషయాన్ని గుర్తుచేస్తున్నాయి కాని, లేకుంటే విశ్రామ తపోధనుడనిపిస్తాడనటంలో సందేహం లేదు.

కాని, భగవత్ప్రార్థనలో లీనమై బాహ్యాన్ని విస్మరించలేదతను. జైలు అధికారుల విజిలు పిలుపుతో కర్తవ్యతామూఢుడై కటకటాలదగ్గర నిల్చుండిపోయాడు. ఇంతలో "రాత్రి బాగా నిద్రపట్టిందా, తాతా!" అని పలుకరిస్తూ రక్షకభటుడు గది తాళాలు తీశాడు. నెమ్మదిగా బయటకు నడుస్తూ ఏదో అస్పష్టంగా గొణిగాడు, సమాధానంగా, ఆఖైదీ నంబరు 112.

నా గదితలుపులు కూడా తెరిచారు. తోటి ఖైదీలను కలవడానికి అడుగులు వేగంగా వేస్తున్నాను.

"ఏం తమ్ముడూ, బాగున్నావా? రాత్రి వచ్చావంటగా? మన కానిస్టేబులు కనకయ్య చెప్పాడులే. అదిసరేగాని ఈసారి ఏంటినేరం?" అని ఎవరో అడగటం వినిపించింది.

తలయెత్తి చూశాను. మొదటిసారి నేను జైల్లో పడ్డప్పుడు పరిచయమై, సాన్నిహిత్యం చేత సాంగత్యం బలపడి, నేను జైలుకు వచ్చినప్పుడల్లా పలుకరిస్తాడు. అతని పేరు శంకరం. ఒక ద్రోహిష్మికేసులో నలుగురితో ఐదోవాడుగా అరెస్టు చేయబడి మూడు సంవత్సరాల ఖైదు జీవితం గడుపుతున్నరకం శంకరం. "నేను నిర్దోషిని, తమ్ముడూ! అయినా, నలుగురితోపాటు నాకూ వేశారు ఖైదు" అంటాడు. కాని అతని ముఖంలో విషాదచ్ఛాయలు ఏనాడూ కనిపించవు.

"ఏం తమ్ముడూ, మాట్లాడవు?" అంటూ భుజంమీద చేయి వేశాడు. నాకు సమాధానం చెప్పాలనిపించలేదు. అంగలు వేగంగా వేస్తూ నడిచాను. అతనూ నావెంట వేగంగా నడుస్తూ హఠాత్తుగా ఆ ఖైదీ నంబరు 112 వద్ద ఆగి, "నమస్కారం తాతయ్యా. నాలుగు తత్త్వాలు వినిపించుదూ" అన్నాడు.

"ఏయ్, ఏమిటా అనవసరపు వాగుడు? నీపనేదో నీవు చూసుకో" అని తుపాకిమడమతో పొడిచాడు ఒక కానిస్టేబులు, శంకరాన్ని.

## 2

మధ్యాహ్నం ప్రక్కగదిలో ఖైదీనంబరు 112 రామనామస్మరణ చేస్తున్నాడు. జీవితంలో ఎన్నో పాపాలు చేశాను. ఎన్నో క్రూరకృత్యాలు నిస్సంకోచంగా చేశాను. కాని, అతన్ని చూస్తుంటే నాకెందుకో అవ్యాజానురాగం, ఆత్మీయత, భక్తిప్రపత్తులు పెనవేసుకుంటున్నాయి. అతను ఎవరో తెలియదు. కాని తోటి ఖైదీ. ఏ నేరం ఆరోపించబడి శిక్షననుభవిస్తున్నాడో? ఖైదీలందరికి అతను సుపరిచితుడుగానే కనిపిస్తున్నాడు.

అందరూ అతనంటే ఒకవిధమైన గౌరవాన్ని చూపుతున్నారు. చివరకు జైలు అధికారులుగూడా! ఇంతెందుకు, కర్కోటకుడు అని పేరుబడిన కానిస్టేబుల్ మస్తాన్‌గూడ ఖైదీ నం. 112 ను కించిత్తు గౌరవంగా చూస్తాడు. ఎందుకో?

అతన్ని గురించి తెలుసుకోవాలనిపించింది. అతని ముఖకవళికలలో లీలగా కనిపిస్తూ, అతని నడవడిలో ద్యోతకమౌతున్న బాధకు కారణం తెలుసుకోవాలన్న తహ తహ ఎక్కువయింది మనసులో. అంతేగాదు. తెలుసుకుని అతని బాధలో భాగం పంచుకుందామనే సానుభూతి కలిగింది నాకు.

"తాతా!" నేను పిలిచాను.

పలుకలేదు. కాని 'ఏమిటి?' అన్నట్లు కనులతోనే ప్రశ్నించాడు.

"నీ పేరేమిటి?" నేనడిగాను.

"సూరయ్య అంటారు."

"పెద్దతనంలో నీకీ జైలు ప్రవాసం ఎందు కొచ్చిందో తెలుసుకోవచ్చా?"

కొన్ని నిమిషాలు మౌనంగా గడిచాయి.

"శిక్షాస్మృతికి వయసుతో పనిలేదు బాబూ! న్యాయాన్యాయ విచక్షణచేసి ధర్మాన్ని సంస్థాపించటమే మన శిక్షాస్మృతి లక్ష్యం. కులమత విభేదాలు, వర్గ విభేదాలు, వయసు — వీటన్నిటికీ అతీతం శిక్షాస్మృతి లక్ష్యం."

"ఆ లక్ష్యాన్ని సరిగా సాధిస్తున్నారంటారా?"

"అంటే?"

"న్యాయం సరిగా జరగటంలేదంటాను. శిక్ష ననుభవించేవారిలో నిజంగా నేరం చేసినవాళ్లు చాలా కొద్దిమంది ఉన్నారేమో! మరోరకంగా చెప్పాలంటే నేరస్తులందరూ శిక్ష ననుభవించటం లేదు. అందుకే నేరముల సంఖ్య నానాటికి పెరుగుతున్నదిగాని తరగటం లేదు."

అతను ఒక్కక్షణం ఆశ్చర్యంగా నావేపు చూశాడు.

"తప్పు. న్యాయశాస్త్రాన్ని విమర్శించే తాహతు మనకు లేదు. మనం కర్మభూమిలో పుట్టి పెరుగుతున్నాం. కర్మానుగుణంగా వచ్చే కష్టనష్టాలను తాలిమితో అనుభవించటమే మన కర్తవ్యం." ఆ మాటలంటుంటే అతని కంఠంలో ఏదో వ్యథ అస్పష్టంగా మెదిలింది.

"అవును. అలా అనుకునే సంతృప్తిపడాలి. సాక్ష్యాధారాలను దృష్టిలో పెట్టుకుని వాద ప్రతివాదనలు విని, బలమైన వాదంవైపు మొగ్గి తీర్పు చెప్పేంతకాలం అలాగే తృప్తి పడాలి. నిజమైన అపరాధులు అనుకూలమైన సాక్ష్యాన్ని సృష్టించుకుని నిరపరాధులుగా పరిగణింపబడేటంతకాలం న్యాయశాస్త్రం తన విధిని సరిగా నిర్వర్తించలేదంటాను."

"నీపేరేమిటి బాబూ?"

చెప్పాను.

"నీకీ శిక్ష ఎందుకు వేశారు?"

"నే చెబితే నమ్ముతారా?"

"సాక్ష్యం కోరనులే."

"అవును. మీరు నమ్మినా లోకం నమ్మదు. ఈ లోకం విచిత్రమైంది. మీ జీవితాన్ని మీరు సక్రమంగా వెళ్లబోసుకున్నంతకాలం దానికి, అంటే లోకానికి మీతో పనిలేదు. మీలో ఎప్పుడు ఏమాత్రం దోషం కన్పించినా మీ జీవితకాలమంతా మీలోని దోషాల్ని వెతికి వ్రేలెట్టి చూపుతుంది."

"అనుభవంమీదగాని ఎవరూ తెలుసుకోలేని నగ్నసత్యమిది."

"నిజం చెప్పారు. నా అనుభవాన్ని చెప్తాను.... మాది కొంచెం బీద సంసారమనే చెప్పాలి. ప్రెస్సులో సంపాదించే డెబ్బయి రూపాయలతో ఆలు బిడ్డలను, తల్లిని పోషించాలి. ఒక్కడే కొడుకు నాకు. వాడికి పన్నెండో యేడు జొరబడగానే టైఫాయిడ్ జ్వరం పట్టుకుంది. డాక్టరుకు చూపెట్టాము. ఫీజు ఖర్చులు కాకుండా మందులకు, పండ్ల రసాలకు నూటయాభై రూపాయలు కావాలన్నాడు. చేతిలో ఒక పైసా గూడా లేదు. ప్రెస్సు యజమానిని బ్రతిమలాడాను. కాని కరడుగట్టిన ఆ కసాయి గుండెను కరగించలేకపోయాను. మందు లేకుంటే బిడ్డ చేతికందడు. రెండేళ్లలో రెక్కక్రింది కొచ్చే పెధవ. ఐనవాళ్లందరినీ అడిగాను. చివరికి మా మామగారి నడుగుదామని వాళ్ల ఊరికి బయలుదేరాను.

అప్పుడే స్టేషన్‌లో బండి కూత పెడుతున్నది. నాలుగు అంగలు పడిగావేస్తే అందుకో వచ్చునుకుని వడివడిగా నడుస్తున్నాను. పేదరికం ఒక వైపు, శరీర రుగ్మతలు మరొకవైపు చేరి వెక్కిరిస్తున్నట్లనిపించింది. వివిధమైన ఆలోచనలు మనసును ముసురుకుని వివేచనా శక్తిని మ్రింగివేస్తున్నాయి. ఇంతలో ఒక స్త్రీ— అప్పుడే రైలు దిగి వస్తున్నది కాబోలు, కాళ్లు కాలుతున్నవి కాబోలు—పరుగెత్తుతున్నట్లుగా, నడుతూ లేస్తూ నడుస్తున్నది. బండిని అందుకోవాలనే నా ఆతురతలో, మలుపు తిరిగేటప్పుడు నా చేయి ఆమెకు తగిలింది. ఆమె అగ్గి తిట్టటం మొదలెట్టింది. కళ్లతోనే క్షమాపణ చెప్పుకుని ముందుకు సాగిపోయాను. పది గజాలు నడిచిన తర్వాత కాలికేదో గ్రుచ్చుకున్నట్లుగా తోచి నడుస్తూనే వెనుకకు తిరిగి చూశాను. ఆమె వెళ్లింది. దగ్గరలో ఏదో తళుక్కుమంది. ఆశ్చర్యం, అది బంగారు గొలుసు! ఆశ్చర్యంతోపాటు భయంకూడా కలిగింది. కాని కుటుంబ పరిస్థితులు, ఆర్థిక దుస్థితి భయాన్ని ప్రక్కకు నెట్టాయి. గొలుసు తీసుకుని మెల్లిగా జేబులో వేసుకున్నాను. రకరకాల ఆలోచనలు మస్తిష్కంలో మెదిలాయి. వాటి పర్యవసానం ఊహించుకోకముందే స్టేషన్ దగ్గర పడింది. కాని రైలు వెళ్లిపోయింది. ఏమి చేయటానికీ పాలుపోక జరిగిన వివిధ సంఘటనలను సమీకరించుకుంటూ స్టేషన్‌లో కొద్ది క్షణాలు నిల్చున్నాను. జరుగవలసిన కర్తవ్య


## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక చందాదారులకు విజ్ఞప్తి!

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కొరకు చందా పంపేవారు ఈ దిగువ పేర్కొన్న అంశాలు పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నాము:

1 చందా పంపేటప్పుడు మని ఆర్డర్ కూపనులో కాని ఉత్తరంలోకాని తమకు ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక పంపాలని స్పష్టంగా వ్రాయాలి.

2 పాత చందాదారులు తమ చందా సంఖ్య ఉదాహరించాలి

3 ఎంతకాలం పంపవలసినది స్పష్టంగా వ్రాయాలి

4 గ్రామం పేరు పోస్ట్ ఆఫీసు, ఏఊరుమీదుగా పంపవలసినది (అవసరమైన సందర్భాలలో), తాలూకా జిల్లా మున్నగు వివరాలు అన్నీ స్పష్టంగా వ్రాయాలి

5 చందా మొత్తం 'మేనేజర్, ఆంధ్రప్రభ లిమిటెడ్ విసెంటురోడ్డు, గాంధీనగర్, విజయవాడ-3' అను నామాన పంపాలి

**సాలుచందా రు.15-60న.పై**

**6 నెలలకు రు. 7-80 న.పై.**

**3 నెలలకు రు. 3-90 న.పై.**

సదా చందాదారుల సహకారం అర్థిస్తున్నాము.

మేనేజరు.



## నవగ్రహ కీర్తనలు

సుప్రసిద్ధ 'గానకళాబోధిని' గ్రంథకర్తలైన ఎస్. పి. పార్థసారథి, శ్రీమతి ఎస్. పి. ద్వారకాపార్థసారథిగార్లచే శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారి నవగ్రహ కీర్తనలు టీకాతాత్పర్యములతోను, స్వరసాహిత్యముతోను, రాగ లక్షణములతోను శ్రీయుతులు ప్రొఫెసర్ సాంబమూర్తి, మైసూరు వాసుదేవాచారి, ద్వారం వెంకటస్వామి నాయుడు, రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగార్ల చక్కటి అభిప్రాయములతో వెలువడినది. వెల రు. 3/-. పోస్టేజి అదనం. ప్రతులకు: ప్రిన్సిపాల్, మద్రాసు సంగీత కళాశాల, గోపాలపురం, మద్రాసు—6.

నేమిటో ఆలోచించుకుంటున్నాను. ఇంతలో....

'ఏయ్.... ఇటురా!' అంటూ ఒక రైల్వే పోలీసు పిల్చాడు. నాకు గుండెలు జారిపోయాయి. ఐనా, ధైర్యాన్ని కూడదీసుకుని దగ్గరకు వెళ్లాను. అతను రైల్వే పోలీసు ఆఫీసుకు దారితీశాడు. వెంట వెళ్లాను. అచట ఇందాకటి స్త్రీ కూర్చుని ఉంది. నన్ను చూడగానే 'అవును. ఇతనేనండి' అన్నది, ఇన్‌స్పెక్టరుతో.

'గొలుసు ఏది?' అన్నాడు ఇన్‌స్పెక్టర్ నన్నుద్దేశించి.

'ఏ గొలుసు?'

'ఏ గొలుసైంది తెలియదేం?' అంటూ నా జేబులు వెదికి గొలుసు బయటికి తీశాడు, ఇన్‌స్పెక్టర్. తర్వాత ఏవేవో ప్రశ్నించాడు. నాకేమీ వినిపించలేదు. వినిపించినా సమాధానం చెప్పే స్థితిలో లేను. ఎవరో నా గొంతుని నొక్కివేస్తున్నట్లనిపించింది. అదో విధమైన నిస్పృహ, విసుగు జనించాయి నాలో. దైవోపహతుడు తరుముకువచ్చే దురదృష్టాన్ని తప్పించుకోలేడు. ఆ సమయానికి పరిస్థితులు అలా కూడినవి. ఆ సమయంలో నేను ఎంత నిజం చెప్పినా నమ్మరని తెలుసు. తర్వాత విచారణ జరిగింది. అప్పుడు నేను నిజమే చెప్పాను. కాని, నా బీదరికం, కుటుంబ పరిస్థితులు, డబ్బు అవసరం నీటిని ఆసరాగా తీసుకొని నేను దోషిననే అంతా నమ్మారు. సాక్ష్యం పలికించారు. అంతే. నాకు ఆరు నెలలు శిక్ష వేశారు."

"జైలునుండి వచ్చిన తర్వాత నిజంగానే దొంగతనం చేశావుకదూ?"

"అవును. ఒక్కసారి దొంగగా పరిగణింపబడ్డ తర్వాత ఎంత మంచిగా ఉండాలని ప్రయత్నించినా వెనుకటి పేరును మాపుకోలేము."

"అందుకని ఆత్మను చంపుకుని దొంగతనం చేస్తావా?"

"దొంగతనమే గాదు.... హుఁ ఎక్కడి ఆత్మ! ఆ పరిజ్ఞానం నశించింది నాకు. ధర్మమార్గమవలంబించి జీవితం వెళ్లబోసుకుంటున్న నాకు ఎప్పుడైతే అధర్మగామి అని పేరు వచ్చిందో అప్పుడే నాలోని స్థితప్రజ్ఞత నశించింది. లోకంపోకడలపైన కోపం, విసుగు జనించాయి. నన్ను దొంగగా భావించిన లోకం మీద దొంగతనం ద్వారానే పగ సాధించాలనుకున్నాను. పాపభీతి పారిపోయింది. దొంగనయ్యాను. దొంగతనం చేశాను.... చేస్తాను...."

మౌనం కొన్ని క్షణాలను ప్రమింగింది.

"అయినా నీకు అన్యాయం జరుగలేదే?" అని ప్రశ్నించాడు, ఎక్కడో చూస్తూ. ఆమాటలు విని అప్రతిభుడనయ్యాను. నోట మాట రాక వెర్రిగా చూశాను అతనివైపు.

"అవును. నీవు చెప్పినదంతా నిజమైతే, నీ కన్యాయం జరుగలేదనిపిస్తోంది. నీవు దోషివే. నీది కాని వస్తువు నీకు దొరికినప్పుడు నీవు దాన్ని దాని యజమానికి చేర్చే మార్గం వెదకాలి. కాని అలా జరుగలేదు. నీలోని పాపపు చింతన దాన్ని నీ స్వంతం చేసుకోమని ప్రేరేపించింది. అది దొంగతనంకంటే పాపం. రెండవది, నీవు ఎంత అన్యాయానికి గురిచేయబడ్డా, నీ న్యాయవర్తనాన్ని నీవు త్యజించకూడదు. అందుకే నీకు న్యాయం జరుగలేదు." ఆమాటలు అంటూంటే అతని కనురెప్పలు టపటప కొట్టుకున్నాయి, దేనిగురించో ఆలోచిస్తున్నట్లు.

అతను చెప్పినదాంట్లో అసత్యం లేదనిపించింది. అయినా నాకు బాధ కలిగింది. అవును మరి, ఒక వ్యక్తి తన బాధను మరొక వ్యక్తికి వినిపించడంలో, అతనినుండి సానుభూతి కాంక్షిస్తాడు. తద్వ్యతిరేకంగా జరిగినప్పుడు బాధే కలుగుతుంది. ఇంత నిర్మొహమాటంగా, నిష్పక్షికంగా న్యాయాన్యాయ విచారణ చేస్తున్న ఈ సత్యవర్తనుడు చేసిన నేరమేమిటో?

"తాతా" అంటూ ద్వారంవద్ద పిలుపు వినిపించింది. అతను కానిస్టేబులు కనకయ్య. ఖైదీ నం. 112 గదితాళాలు తీస్తున్నాడు. అతనివెంట మరో ఇద్దరు పోలీసులు ఉన్నారు.

"ఇవ్వాళ తీర్పు చెప్తారంటగా, తాతా?" అన్నాడు కనకయ్య.

'అవును' అన్నట్లుగా తల ఊపి మెల్లగా బయటికి నడిచాడు తాత.

"ఏంటో పాపం... నేరం చేసేదొకడు, శిక్షను బవించేది మరొకడు. పెపంచమంతా ఝూఠా" అన్నాడు మస్తాను, తాత చేతులకు బేడీలు తగిలించి నడిపించుకు వెళ్లుతూ.

## 3

చీకటి పడుతున్నది. తాత ఇంకా రాలేదు. విచారణ ఎప్పుడో అయిపోయి ఉంటుంది. ఏమని తీర్పు చెప్పారో? తాతకు ఏమి శిక్ష పడిందో?... ఇలాటి ఆలోచనలతో చీమల పుట్టైంది మనసు. నా గది మారు మూల కావటాన గాలి రావటం లేదు. బయట చీకటి, ఉక్క. మనసులో దిగులు, చికాకు పేరుకుపోతున్నాయి.

ఇంతలో తలుపు తీసిన చప్పుడయింది. అలవాటుగా కాళ్లు బయటకు నడిచాయి. మూకుడూ, ముంతా తీసుకుని తోటి ఖైదీలందరూ నిశ్శబ్దంగా నడుస్తున్నారు, వంటశాలవైపు. జైలు అధికారులు ప్రసాదించిన రెండు మెతుకులు, నప్పుచారు గొంతుకదాటి లోపలికి పోమని మొరాయించాయి. చేసేదిలేక ముంతలోని నీళ్లతో గొంతు తడుపుకుని ఇవతలకు వచ్చాను. రోజూ అమృతం అనిపించే భోజనం ఆరోజు ఎవరికీ రుచించినట్లు లేదు. అంతమందిమి ఒక్కచోట చేరినా నిశ్శబ్దం తాండవించింది. అందరి ముఖాలలో విచారం గూడు కట్టుకుంది. మనసులోని దిగులు భయంగా మారింది, ఎందుకనో!

"మారయ్య తాతకు యేమి శిక్ష వేశారు?" అప్రయత్నంగా ప్రశ్నించాను, దగ్గరగా వెళ్ళుతున్న శంకరాన్ని. శంకరం అదోమాదిరిగా చూశాడు. ఆ చూపుతో 'నీకింకా తెలియదా?'


నారసింహా లేహ్యం

శ్రీష మంయిపది — మేహము, నిస్త్రాణ, నిస్సత్తువను హరించి వీర్యవృద్ధిని, బలము రక్తవృద్ధి కలిగించును. 20 తు. రు. 3—50

రోజాపువ్వు లేహ్యము

అజీర్ణం, గర్భవాతం, మలబద్ధకం హరించి చక్కగా విరేచనమును, జీర్ణశక్తిని కలిగించును. 15 తు. రు. 1—25, పోస్టేజి ప్రత్యేకం. క్యాటలాగు ఉచితం. పి. సి. ఏ. అండ్ కో., ఆయుర్వేద సమాజం, పెరిదేపి, నెల్లూరు జిల్లా.

అప్పు తీసుకోండి

250 నుంచి 10 వేల రూపాయల వరకు

వివాహం, వ్యాపారం, ఇల్లు, కారు, స్కూటర్ మున్నగు వాటి కొరకు; స్వంత జామీనుపై; సులభమైన నెలసరి వాయిదాలపై తిరిగి చెల్లించేపద్ధతిని. ఉచితంగా పంపే ప్రాస్పెక్టస్ కొరకు నేడే ఇంగ్లీషులో కాని, హిందీలో కాని వ్రాయండి.

KUBER FINANCE (P) LTD.,
(K—54) AMRITSAR-5.




కుటుంబ నియంత్రణ

ప్లానిటాబ్‌తో

మిక్కిలి సులభము!

PLANITAB
OVULES

HIND CHEMICALS LTD., KANPUR

డాక్టరునుగాని యఫ్. పి. క్లినిక్‌నుగాని సంప్రదించండి

సినీతారల ఫొటోలు
మీ అభిమాన సినీతారల ఒరిజినల్ ఫొటోలు అందమైన పోజులలో పెద్దసైజు డజను రు 5/-. పోస్టేజి రు. 1 - అదనం
**Cine Photo Distributors,**
Govt. Regd. No. 1875
(P.O.) RELANGI (W.G.) A.P.

డాక్టర్ వృత్తి చేయండి!

ఇంటిలో విరామంగా కూర్చొని ఉండేప్పుడు పోస్టల్ ట్యూషన్ద్వారా, హోమియోపతి చదువు కొని, గవర్నమెంటు రిజిస్టర్డు కాలేజి ద్వారా డిప్లొమా పొందండి. ప్రాస్పెక్టస్ ఉచితము.
వివరములకు వెంటనే వ్రాయండి:
INDIAN HOMOEOPATHIC COLLEGE
(A.W.P.) JULLUNDUR CITY

జర్మెక్స్
అన్ని రకాల చర్మ వ్యాధులకు


ఎగ్జిమా, ఏనుగు దురద, తామర, మొటిమలు, ఉడుకు బొబ్బలు, పుండ్లు ఇతర రకాల చర్మ వ్యాధులను నివారించగలదు.
రిటిల్స్ ఓరియంటల్ బామ్ & ఫార్మస్యూటికల్స్ లిమిటెడ్, మద్రాసు




# నిష్కృతి

అని ఎదురు ప్రశ్నించినట్లయింది నాకు.

"ఉరి శిక్ష!"

అదిరిపడ్డాను. ఉరిశిక్ష పడటానికి తాత చేసిన నేరమేమిటి? అదే ప్రశ్న శంకరాన్ని ప్రశ్నించాను.

"ఎవర్నో ఖూనీచేసి డబ్బు కాజేశాట్ట."

నా మనసులో ఏదో ఆలోచన మెదిలింది. తాత హత్య చేశాడన్నమాట. పైకి అమాయకుడులా, సద్వర్తనుడులా కన్పించినా, అతను నిజంగా ఇంతటివాడా అనిపించింది. అతనిని చూసినవాళ్లెవ్వరైనా అతను ఖూనీకోరని అనలేరు. అతను నిర్దోషి అయికూడ పరిస్థితుల ప్రాతికూల్యంవల్ల దోషిగా పరిగణింపబడి అయినా ఉండాలి; లేక నిజంగానే నేరంచేసి పశ్చాత్తాపాగ్నిచే దహింపబడుతూనైనా ఉండాలి అనిపిస్తుంది మాసేవాళ్లకు. నా విషయంలో అక్షరాలా అలాగే జరిగింది.

నాకు గొలుసు దొరికేవరకూ నాలో ఏ పాపపు చింతనా లేదు. నాకున్న అవసరాలు, డబ్బు ఒత్తిడి ఆ గొలుసును స్వంతం చేసుకోమని ప్రోత్సహించినవి. ఆ ప్రయత్నంలోనే పట్టుబడ్డాను. శిక్ష అనుభవించాను. నేను జైల్లో ఉండగానే నా కుమారుడు చనిపోయాడు. కుమారుడు పోయాడనే దిగులుతో మంచమెక్కి తిరిగి కోలుకోలేదు నా భార్య. విధిచేత పూర్తిగా వంచింపబడ్డాను నేను. నాలోని ప్రతీకారవాంఛ విజృంభించింది. ఎవరిమీద? ఈ లోకంమీద. నిజం చెప్పినా విన్పించుకోకుండా లేనిపోని కారణాలు చుట్టబెట్టి ఒక అమాయకుణ్ణి దోషిగా నిర్ణయించే ఈ లోకం, న్యాయస్థానం—అన్యాయంగా నలుగురి కడుపులు కొట్టి ఘరానాగా బ్రతికేవాళ్లను ఏమీ చేయలేదు. అందుకే మొట్టమొదట ఆ ఘరానా మనుషుల పని పట్టాలనుకున్నాను. అలాంటివాళ్ల పర్సులు దొంగిలించాను. ఖూనీలు చేశాను. ఇంకా ఘోరాలు చేశాను. కాని...ఇటీవల ఎందుకో జీవితంమీద విసుగు పుడుతున్నది. నాలో ఏదో పరివర్తన వస్తున్నదనే అనుమానం కలిగింది నాకు. ఆ రోజు ఆ గొలుసును తాకకుండా ఉంటే నా జీవితం ఇంత నికృష్టంగా తయారుగాకపోవునేమో! తప్పటడుగు ఒక్కటైనా చాలు, జీవితగమనాన్ని తలక్రిందులు చేయటానికి.

ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటల సమయం. నేను నా గదిలో ఒక మూలగా కూర్చుని ఉన్నాను. బయట వరండాలో కానిస్టేబులు కనకయ్య కుర్చీ పీటమీద కూర్చుని ఉన్నాడు. అతను కానిస్టేబుళ్లందరిలోకి కొంచెం మంచివాడు. ఉదార స్వభావుడు. కొంచెం జాలి గుండె కలవాడు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకొని సహాయం చేయలేకపోయినా, మంచిచెడ్డలు విచారించి సానుభూతి చూపెడుతుంటాడు.

ఆ ఉద్యోగం చేసేవారిలో అంతటి జాలిగుండె వాళ్ళుండటం అరుదు.

కనకయ్యను కదిలిస్తే సూరయ్యతాత పుట్టు పూర్వోత్తరాలు తెలియవచ్చనిపించింది. మెల్లిగా లేచి కటకటాల తలుపువద్దకు వచ్చాను.

"కనకయ్యగారూ!" పిలిచాను.

జేబురుమాలుతో తుపాకిని తుడుస్తూ "ఏమిటి?" అన్నాడు కనకయ్య.

"సూరయ్య తాతను ఉరి తీసేదెప్పుడు?"

"ఇవాళే. ఇంక రెండు గంటల్లో!"

"అతను చేసిన నేరమేమిటి?"

"హత్యా, చోరీ."

"ఎవర్ని?"

"రామలాల్ అనే శేట్‌ని."

ఆ జవాబుకు నే నదిరిపడ్డాను. మిన్ను విరిగి మీద పడబోతుందన్నా, మహాప్రళయం రాబోతుందన్నా అంతగా చలించేవాడిని కాదు. కనకయ్య చెప్పేదీ, నేను వినేదీ నిజమేనా అనే అనుమానం వచ్చింది నాకు.

"లక్ష్మీపురం నగల వర్తకుడు రామలాల్నేనా?" ఆదుర్దాగా అడిగాను.

"అవును. అతను నీకు తెలుసా?" కాన్‌స్టేబులు కనకయ్య కుతూహలంగా ప్రశ్నించాడు.

"ఆ సంగతి తర్వాత చెప్తాను. ముందు మీరు చెప్పింది నిజమేనా చెప్పండి. సూరయ్య తాత నిజంగా ఖూనీ చేశాడా?" అన్నాను ఆవేశాన్నీ, ఆవేదననూ అపుకుంటూ.

కనకయ్య ఒక నిట్టూర్పు విడిచి ఈ విధంగా చెప్పాడు: "ఏమో పాపం! నిజానిజాలు పరమాత్ముడికి తెలియాలి. నాకు తెలిసినంతవరకూ చెప్తా విను. ఈ సూరయ్యతాతది చాలా బీద కుటుంబం. ఒక చిన్న ఇల్లుమాత్రమే అతనికి 'నాది' అని చెప్పుకోతగ్గ ఆస్తి. పెరట్లో కూరగాయల్ని పండించుకొంటూ, వాటిని అమ్మగా వచ్చిన నాలుగు రాళ్లతో జీవితం వెళ్లబోస్తున్నాడు. మొదటినుంచి గూడా ఎంతో దైవభక్తుడు. వాళ్ల కులదైవం రాములవారు. విశ్రాంతిగా కాలాన్ని వెళ్లబోస్తున్నా అతనికి ఉన్నదల్లా ఒక్కటే చింత, లోటు — 'తనకు సంతానం కలుగలేదే' అని. భార్యాభర్తలిద్దరూ ఎన్నో ఉపవాసాలుండి, ఎన్నో నోములు నోచి, ఎన్నో పుణ్యక్షేత్రాల్ని దర్శించి మహాత్ముల ఆశీస్సులను పొందారు. ఆ ఆశీస్సుల ఫలితమా అన్నట్లు కొన్నాళ్లకు అతని భార్య గర్భవతి అయింది. కాని వారు ఏ పూజలలో లోపం చేశారో, లేక ఏ క్రూరవిధి వారి అదృష్టానికి ఓర్వలేకపోయిందో అతని భార్యకు పెద్ద జబ్బు చేసింది. అప్పుడే సూరయ్యతాత రామలాల్ దగ్గర ఐదు వందల రూపాయలు అప్పు చేశాడు. ఖర్చుకు వెనుకంజ వేయకుండా ఎంతోమంది డాక్టర్లను సంప్రదించాడు, తన భార్య జబ్బు విషయంలో. ఎన్నో మందులు ఇప్పించాడు. కాని ఫలితం శూన్యమయింది. ఆ జబ్బులోనే ఆమెకు నెలలు నిండాయి. కొన్ను కష్టమై కనులు మూసింది. నిశ్చలమైన గర్భస్థ శిశువును బయటకు తీశారు డాక్టర్లు.

ఆనాటినుండి సూరయ్యతాత జీవితమే మారిపోయింది. అహర్నిశం రామనామస్మరణ లోలుడై కాలాన్నే మరిచిపోయేవాడు. ఒకరితో ప్రమేయంలేకుండా, వేళకు రెండు మెతుకులు కొరికి మిగతాకాలాన్ని రామనామం జపిస్తూ వెళ్లబుచ్చేవాడు.

గాయమైనచోటే మరల దెబ్బ తగులుతుంది. అందుకేకాబోలు కష్టాలు ఒంటరిగా రావంటారు. తన బాకీ వడ్డీతోసహా తీర్చమని కోరాడు, రామలాల్. ఇంట్లో ఉన్న నగా, నట్రా భార్యకు జబ్బుచేసిన తొలిరోజుల్లోనే హరించుకు పోయాయి. సరియైన పోషణలేక కూరగాయల పాదులు రాబడిని పూర్తిగా తగ్గించినవి. పొట్ట గడవటమే సమస్యగా ఉన్న గడ్డురోజుల్లో బాకీ అసలు ఫాయిదాలు ఎక్కడినుండి తెచ్చి తీర్చ గలడు? అందుకని 'కొంత వ్యవధి ఇప్పించండి. మీ బాకీ పూర్తిగా పరిష్కారం చేస్తా' అన్నాడు సూరయ్యతాత. రామలాల్ అంగీకరించలేదు. కనీసం ఒక నెల వ్యవధి ఇప్పించమని, —దావాలు తెచ్చి, రచ్చకీడ్చి తనను అరడిచేయవద్దని బతిమాలుకున్నాడు. చివరకు రామలాల్ ఒక విధంగా రాజీకి వచ్చాడు. మూడు నెలలలోగా బాకీ పరిష్కారం చేస్తానని, అలా చేయని పక్షంలో రామలాల్, సూరయ్యతాత ఇంటిని స్వాధీనం చేసుకుని దానిని అమ్మగా వచ్చిన డబ్బుతో తన బాకీ చెల్లుబెట్టుకోవచ్చునని—సూరయ్య తాత పెద్దమనుషులముందు చెప్పాలి. అదేవిధంగా పెద్దమనుషులముందు వాగ్దత్తం చేశాడు సూరయ్యతాత. సరిగా మూడు నెలలకు, ఒక రాత్రి ఎనిమిది గంటల సమయంలో రామలాల్ హత్య చేయబడ్డాడు. కెవ్వుమనే అసహజమైన కేక విని ఇరుగుపొరుగువారు రామలాల్ ఇంటి వద్దకువచ్చి చూడగా అక్కడ రామలాల్ శిరస్సు పగిలి పడి ఉన్నాడు. సూరయ్యతాత బెదురు చూపులతో, చేతిలో గునపంతో నిల్చుని ఉన్నాడట. అతని బట్టలు రక్తసిక్తమై ఉన్నాయట. అతనివద్ద ఏడు వందల రూపాయలు సూడా పట్టుబడ్డాయట."

"అన్యాయం. అతను హత్య చేయలేదు. అతను నిర్దోషి. సూరయ్యతాత నిర్దోషి." ఆవేశంగా అరిచాను.

"ఏయ్, ఏమిటి నీవనేది?" కనకయ్య గద్దించాడు. ఇంకా ఏవేవో మందలింపులు పలికాడు. కాని నాకవి సరిగా వినిపించలేదు. నా మనసులో ఏవేవో చిత్రాలు కళ్లకు కట్టినవి. ఏవేవో ఊహలు రూపకల్పన చేసుకున్నవి. అనుకోకుండా ఒక క్లిష్టసమస్య ఎదుర్కొంది. ఎటూ తేల్చుకోలేని ఆ సందిగ్ధస్థితిలో ఒక్క క్షణం జరిగిన సంగతులు జ్ఞప్తికొచ్చినవి.

## 4

రామలాల్‌ను చంపింది నేను. ఈ పాపిష్టి చేతులతోనే దారుణంగా చంపాను. అతనివద్ద ఐదు వందలు అప్పు తీసుకోవాలని వెళ్లాను. మర్యాదగా అడిగిచూశాను. ఇవ్వలేదు. దౌర్జన్యానికి దిగబడి గడ్డపలుగుతో తల బద్దలు కొట్టాను. అతని జేబులో ఉన్న పర్సులో వెయ్యి రూపాయలుంటే తీసుకుని పారిపోయాను. మరికొన్ని రోజులకు మరొక షావుకారు ఖజానా కొల్లగొట్టే ప్రయత్నంలో ఉండగా గూర్ఖా చేత పట్టుబడ్డాను. తప్పించుకోవాలని చేసిన ప్రయత్నంలో ఆ గూర్ఖాను హతంచేయవలసి వచ్చింది. కాని అలజడికి ఇరుగుపొరుగులు చేరి నన్ను బందీకృతుణ్ణి చేశారు. ఏవేళ ఎలాంటిదో మనం చెప్పలేము. ఎంతోమంది రక్షకభటులను, కావలివారిని కన్నుగప్పి చేయదలుచుకున్న ఘాతుక కృత్యాలను అవలీలగా ముగించుకుని త్రుటి మాత్రంలో తప్పించుకోగల్గిన నాకు ఆ రోజున పారిపోవటానికి కాలూ, చేయీ ఆడలేదు. నా ఆ హేయ జీవితానికి స్వస్తివాచకం పలికే



అన్యోన్యం

చిత్రం—వి. కిషన్ (నిజామాబాదు)

సమయం వెట్టుకువచ్చింది గాబోలు!

## 5

ఒక్కొక్క సంఘటన అనుకోని పరిణామాల్ని సృష్టించి జీవితగమనాన్నే తారుమారు చేస్తుంది. రాక్షసప్రకృతి గలవారిలో సైతం నిద్రాణమై ఉన్న మానవత్వాన్ని రగుల్కొల్పి వెలుగును ప్రసాదిస్తుంది. దయాదాక్షిణ్యాలనేవి మరిచిపోయి హింసాప్రవృత్తిలోనే చేసిన ఘాతుకకృత్యాలు, అక్రమాలు నన్నెప్పుడూ కలవరపెట్టలేదు. కాని ఇప్పుడు నా నేరానికి అమాయకుడైన సూరయ్యతాత శిక్ష ననుభవించబోతుంటే....నాలో కరడుగట్టిన కాఠిన్యం కరగిపోయింది. నాలోని మానవుడు తొంగి చూస్తున్నాడు. నిరపరాధులు శిక్షింపబడటం నేనిదివరకు చూడకపోలేదు. కాని ఏ అపరాధం చేశారని ఆరోపించబడి ఆ నిరపరాధులు శిక్షింపబడ్డారో ఆ అపరాధం చేసిన నిజమైన అపరాధి

నేరంవల్ల మరొకరు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిసినప్పుడు—లో మెదిలే మనోభావా లిలాగుంటాయనిమాత్రం నాకు తెలియదు.

రామలాల్‌ను హత్య చేసింది నేను. ఎవరు నమ్మినా, నమ్మకపోయినా ఇదిమాత్రం సత్యం; చేసింది నేను గనుక. న్యాయశాస్త్ర రీత్యా నేను పట్టుబడి శిక్షననుభవించాలి. అవును... నేను పట్టుబడ్డమాట నిజమే. కాని రామలాల్‌ను చంపినందుకుగాదు. గూర్ఖాను చంపినందుకు. అందుకు శిక్ష ననుభవిస్తాననిగూడా నాకు తెలుసు. కాగా నేను చేసిన నేరానికి మరొక వ్యక్తి — సూరయ్య తాత — శిక్ష అనుభవించబోతున్నాడు. ఆ శిక్ష దైహికమైనదిగాని, తాత్కాలికమైనదిగాని గాదు. శాశ్వతంగా తనువు చాలించబోతున్నాడు. అదీ, న్యాయశాస్త్రమనే ఉరిత్రాటితో ధర్మదేవత ఒడిలో కనులు మూయబోతున్నాడు.

నాకిది పరీక్షా సమయం. నిజంగా సూరయ్య తాత స్థానంలో ఉండవలసింది నేను. ఇప్పుడు కాకపోయినా, రేపైనా నాకది తథ్యమే. కాని నా నేరంవల్ల మరొక నిర్భాగ్యుడు, ధార్మికుడు విధిచేత వంచింపబడి అన్యాయంగా బలి కాబోతున్నాడంటే అది భరింపరానిది. పాపం, సూరయ్య తాత మనసు ఎంతగా పరితపిస్తూందో! తన ఆధ్యాత్మిక చింతనలో భక్తి ప్రపత్తితో భగవంతునిపై భారముంచి 'విధి'కి తలఒగ్గుతూ నిష్కారణంగా బలి కాబోతున్నాననే భావన, వేదనలను పైకి కన్పడనీయక పోవుగాక. అంత మాత్రంచేత అతని హృదయాంతరాల్లో ఆబాధ, వేదన ప్రతిధ్వనించక మానుతాయా? తన ఆ దుర్గతికి కారణభూతుడైన (ఈ) పాపిని శపించక ఊరుకుంటాయా? లేదు. ముమ్మాటికీ లేదు. అతని స్థానంలో నేనూ, నా స్థానంలో అతనూ ఉంటే.... అబ్బ.....

నేనిప్పుడేం చేయాలి? ఇంతవరకూ గడిపిన ఈ జీవితంలో ఎంతో దుఃఖాన్ని భరించాను. ఎంతో హింసను సహించాను. అన్యాయాల్ని హర్షించాను. కాని.... కాని..... సూరయ్య తాత లాంటివాడు నాబోటివాని దుష్కృత్యానికి ఆహుతి కాబోతున్నాడంటే యీ దుఃఖాన్ని ఎలా భరించను? రంపపు కోతలాంటి ఈ మనోహింసను ఎలా సహించను? ఈ అన్యాయాన్ని ఎలా హర్షించను? నాకు విష్కృతి ఉందా?

నా హృదయం ఆక్రోశించింది. ఆవేశం కట్టలు త్రెంచుకుంది.

"కనకయ్యగారూ!"

"ఆఁ."

"మీరు నాకో సహాయం చేసిపెట్టాలి." అభ్యర్థనగా లేదది; ఆజ్ఞాపనగా ధ్వనించింది.

"ఏమిటది?" ఆశ్చర్యంగా అడిగాడు.

"సూరయ్య తాత నిరపరాధి! అతన్ని రక్షించాలి."


"నీకెలా తెలుసు?"

"నాకెందుకు తెలియదు? రామలాల్‌ను హత్య చేసింది నేను. నేను నేనుతా అతని తల బ్రద్దలుకొట్టి, అతను రక్తపు మడుగులో పొర్లాడుతుండగా చూసి మరీ పరారయ్యాను."

"అందుకు సాక్ష్యం?!"

"సాటి మానవుడి ప్రాణాలు పోవటానికి సిద్ధంగా ఉంటే సాక్ష్యం కావాలనటం బాగు లేదు. పైగా నేరంచేసిన నేను వచ్చి చేసిన నేరాన్ని ఒప్పుకుంటుంటే సాక్ష్యం లేదనే మిషతో త్రోసిపుచ్చటం అవివేకం. సాక్ష్యం లేనంత మాత్రాన నిర్దోషి దోషిగా ఉరిత్రాటికి బలి కావలసిందేనా?"

"నీవు చెప్పేది నిజమే కావచ్చు. కాని సూరయ్య తాత నిర్దోషిత్వాన్ని నిరూపించాలంటే బలమైన నిదర్శనాలు కావాలి. న్యాయస్థానం మీరు చెప్పేది వినగలదు. జరిగినదేదో చూడలేదు. సూరయ్య తాత ఖూనీ చేశాడనటానికి ఎన్నో సాక్ష్యాల్ని చూపారు ప్రాసిక్యూషన్ వారు. వాటిని ఖండించి సూరయ్య తాత నిర్దోషి అని నిరూపించటం ఇప్పటి పరిస్థితుల దృష్ట్యా అసాధ్యం."



చల్లని నీడలో — చిత్రం—ఆర్. నరసింహారావు (ఖర్గపూర్)

"అసాధ్యమెన్నటికీ గాదు. సాధ్యంచేసి చూపెడతాను. నేరం చేసినవాడు స్వయంగా తన నేరాన్ని ఒప్పుకుంటుంటే త్రోసిరాజని ఒక నిరపరాధిని ఉరికంబానికి బలిచేస్తారా? ధర్మరాజ్యమని కొనియాడబడే ఈ దేశంలో ఇంత అన్యాయం జరుగుతుంటే ఎవరు సహిస్తారు? అలా ఎన్నటికీ జరుగదు. జరుగనివ్వను. న్యాయస్థానానికి వెళ్లి ఇప్పుడే నిజం చెప్తాను. సూరయ్య తాతను రక్షిస్తాను.... ర...క్షి...స్తా...ను."

కట్టలుతెగే ఆవేశంతో ఎక్కడికో వెళ్లి ఏమో చేయాలనే ఉద్దేశ్యంతో సుడిగాలిలా విసురుగా పరుగెత్తాను. ఆ వేగంలో తల బలంగా కటకటాలను మూర్కొంది. నుదురు చిట్లింది. రక్తం చిమ్మింది.

అదే సమయానికి సుపరిచితమైన స్వరంలో సూరయ్య తాత పాట విన్పించింది.

"ఏ తీరుగ నను దయ చూచెదవో
ఇనవంశోత్తమ రామా!...."

మనసులోని బాధనూ, హృదయంలోని ఆవేదననూ ద్రవింపజేసే మేళవించి పాడే ఆ పాట జైలులోని ప్రతి మారుమూలా ప్రతిధ్వనించింది. నా వీనులద్వారా నా నరాల్లోకి ప్రాకి ఎక్కడో గింగురుమంటూంది. దిగంతాల్లో ప్రతిధ్వనిస్తుందా అన్నట్లు ఆకాశంలోని మేఘాలు ఒక్కసారి గర్జించాయి. గణగణమంటూ ఏదో గంట భయంకరంగా మ్రోగింది.

"అదిగో, సూరయ్య తాతను ఉరితీయబోతున్నారు" అన్నాడు కనకయ్య. గంట మ్రోగగానే పాట ఆగింది. దూరంగా ఏదో పక్షి వికృతంగా అరిచింది. జైలు ప్రాంగణంలో భరింపరాని నిశ్శబ్దం తాండవించింది. గాలి స్తంభించింది. ఒక నిరపరాధ మానవునికి జరిగే అన్యాయాన్ని గర్హిస్తున్నట్లుగా ఉంది, ప్రకృతి.

నరకమంటూ వేరే లోకం లేదని నా ఉద్దేశ్యం. మానవుడు తను చేసిన పాపాలకు ఈ లోకంలోనే శిక్ష అనుభవిస్తాడు. అయితే తామనుభవిస్తున్నది తాము చేసిన పాపాలకు శిక్ష అని మాత్రం ఎక్కువమంది తెలుసుకోలేరు.

తర్వాత కొన్నాళ్లవరకూ నేను ఒళ్ళు తెలియని జ్వరంలో ఉండిపోయానట. జ్వరంలో "సూరయ్య తాతనిరపరాధి", "హత్య", "రామలాల్"ఇలాంటి మాటలను కలవరించానట. జ్వరం జారగానే నా కేసు విచారణ జరిపారు. విచారణ ఎక్కువ రోజులు పట్టలేదు. నేను చేసిన నేరాలను నేనే ఏకరువు పెట్టి శిక్ష విధించమని అర్థించాను. చివరకు రామలాల్‌ను హత్యచేసిందికూడా నేనేనని, సూరయ్య తాత నిర్దోషి అని వెల్లడించాను. నా మాటలు విన్న కొందరు నాకు మతి భ్రమించిందన్నారు. మరికొందరు నేను చెప్పింది నమ్మి నిర్దోషి సూరయ్య తాతకు తమ శ్రద్ధాంజలులు సమర్పించారు.

ఏమయితేనేం, నాకు శిక్ష వేశారు. నేను అనుకున్నట్లుగా, కోరుకున్నట్లుగా ఉరిశిక్షగాదు. చేసిన నేరాన్ని ఒప్పుకున్నందుకు 'ఉరి' నుండి శిక్షను తగ్గించి యావజ్జీవ ఖైదు వేశారు. ★